గెద్ద

గెద్ద తాటిపేళ్ల బుట్ట చంకన పెట్టుకుని బయలుదేరింది.

అది మార్చి నెల. ఉదయం పది గంటలకే ఎండ చురుక్కుమంటోంది.

అడుగు తీసి అడుగు వేయడానికి వయసు మళ్లిన ఆమె ఆయాసపడుతోంది. అయినా... నెమ్మదిగా అలాగే ముందుకు పోతోంది.

ఆ ఊళ్లోనే కాదు.., ఆ చుట్టుపక్కల గ్రామాల్లో కూడా 'సోది' చెప్పిచెప్పీ అలసిపోయింది.

అలవాటు పడిన ప్రాణం... పొట్ట కూటి కోసం జీవితాంతం కష్టపడుతూనే ఉండాలి.

ఏ ఇంట్లో ఆడపిల్లలు పెళ్ళీడుకు వచ్చిఉన్నా, ఏ ఆడవారు కడుపుతోటున్నా, ఏ కొత్త కోడలు అత్తింట అడుగుపెట్టినా తెలుసుకుని వారింటి ముందుకు చేరుతుంది. ఆమె కంఠానికి ఏదో శక్తి ఉంది. ఆమె మాటలో చాకచక్యం ఉంది. అందుకే ఆమె ఏది చెప్పినా వారు నమ్ముతారు.

ఆ ముందురోజు సాయంకాలం పెద్ద వీధిలో సూరమ్మ ఎదురుపడింది.

"ఆ పెద్ద అరుగుల వారమ్మాయికి ఈరోజు పెళ్ళివారొచ్చి వెళ్లారు! నీకు తెలీదా?" అనడిగింది.

"నాకు ఎఱుక లేదమ్మా!" అంటూనే గెద్ద ముందుకు అడుగులేసి ఇల్లు చేరింది.

ఆ రాత్రి గెద్దకి కంటికి సరిగా కనుకు రాలేదు.

'ఎప్పుడు తెల్లారుతుందా? ఎప్పుడు వారింటికి వెళ్లి సోది చెపుదామా'...ని ఆతురత పడుతూనే ఉంది.

పెద్ద అరుగుల లోగిలి రాగానే ఆ ఇంటి ముందు ఆగింది.

"సోది చెబుతానమ్మ! సోది చెబుతా!" అంటూ గొంతెత్తి అంది.

మూసి ఉన్న ఆ ఇంటి తలుపులు తెరుచుకున్నాయి.

"అమ్మా! సోది చెప్పే ఆమె వచ్చింది!" పరికిణీ కుచ్చిళ్ళు చేత్తో పట్టుకుని పరుగెత్తుకుంటూ వచ్చిన ఓ అమ్మాయి గట్టిగా అరిచింది.

ఇంటావిడ బయటకు వచ్చింది.

"నువ్వా గెద్దా! రా! రా!" అంటూ లోపలికి పిలిచింది.

గెద్ద ఆయాసపడుతూ మెట్లు ఎక్కి ఆవిడ వెంట పెరటి వసారాలోకి వెళ్లింది. ఆవిడ చెప్పిన చోట చంకలోని బుట్ట కింద పెట్టి కూర్చుంది.

ఆవిడ బియ్యం ఉన్న చేట పట్టుకుని వచ్చింది.

గెద్దకు ఎదురుగా ముక్కాలిపీట లాక్కుని దాని మీద కూర్చుంది. బియ్యం చేట గెద్ద ముందుకు జరిపింది.

"నిన్న అమ్మాయికి పెళ్ళివారొచ్చారు. పిల్లను చూసుకుని ఏమీ చెప్పకుండానే వెళ్లిపోయారు. నువ్వు అన్ని విషయాలు వివరంగా చెప్పు!" అందావిడ.

"అమ్మాయిగోరిని పిలవండమ్మా!"

ఆమె మాట పూర్తి కాకుండానే చంద్రముఖి అక్కడ ప్రత్యక్షమయింది.

తల్లి పక్కగా ఓ తుంగ చాప పరుచుకుని చతికిలపడింది.

గెద్ద ఎడం చేత్తో ఆమె ఎడం చెయ్యి పట్టుకుంది.

కుడిచేత్తో బుట్టలో ఉన్న ఓ చిన్న కర్రపుల్ల తీసింది.

చంద్రముఖి అరచేతిలో దానితో అటు, ఇటు పామింది.

తరువాత ఆ చెయ్యి వదిలి కుడి చెయ్యి పట్టుకుంది. ఆ అరచేతిలో కర్రపుల్లతో తిరిగి అటూ ఇటూ పామింది.

"అమ్మా పలుకు! జగదాంబ పలుకు. కాశీలోని గంగమ్మ పలుకు, ఈ ఊరి మాలచ్చుమ్మా పలుకు, ఎల్లమ్మతల్లీ పలుకు! పలుకు పలుకు..! జగదంబా పలుకు పలుకు" అంటూ పదం అందుకుంది.

"ఇదిగో! ఓ అమ్మీ! ఈ సోది ఆపి అసలు సోది చెబుతావా లేదా?" చంద్రముఖి ఆమె చేతిలో నుంచి చెయ్యి లాక్కోబోయింది.

"కోపం వద్దు తల్లీ! సానా కోపం మంచిదికాదు తల్లీ. ఇదిగో సెబుతన్నా! ఉన్నది ఉన్నట్టు సెబుతా! జరిగేది సెబుతా? జరగబోయేది సెబుతా!"

"చెప్పు.... చెప్పు! అసలు సంగతులు చెప్పు! ఎసరు మరిగిపోతూ ఉంటుంది. వెళ్లి బియ్యం పోసి రావాలి!" తొందరచేసింది వెంకట రమణమ్మ.

"పొద్దు పొడిచే దిక్కు నుంచి పెళ్ళోరొచ్చినారు! ఆ వచ్చిన చిన్నోడు ఈ తల్లికి మగడవుతాడు! చిన్నోడు చిన్నమ్మంత సక్కనోడు! పెద్దింటిలో కాలుపెడుతాది, మంచి పేరు తెచ్చుకుంటాది."

"అలాగా! ఎప్పుడు పెళ్ళవుతుందో చెప్పు! చెప్పు!" వెంకట రమణమ్మ మరింత తొందరచేసింది.

"తొందర పడకమ్మా! ఉన్నది ఉన్నట్లు సెబుతా! కనక దుర్గమ్మ తల్లి ఆన! ఆ మల్లమ్మ తల్లి ఆన! తల్లీ! నెల దాటకుండానె పెల్లవుతాది! ఎన్నెల ఏల మనువాడుతాది! ఆ జగదాంబ తల్లి ఆన!" అంటూ ఆమె చేతిలో కర్రపుల్లతో గట్టిగా పాముతూ నొక్కి చెప్పింది.

చంద్రముఖి బుగ్గలు యాపిల్ పండ్లలా ఎరుపెక్కాయి.

దాచుకోలేని సిగ్గు కళ్లలో చేరి కలవరపెట్టింది.

ఆమె చెయ్యి వెనక్కి లాక్కుంది.

"అమ్మాయిగారిని చూసినారా! ఎలిగిపోతోంది. పొద్దు ముఖంలా ఎలిగిపోతోంది" గెద్ద మాటలకి అందరూ నవ్వుకున్నారు.

చంద్రముఖి లోపలికి పరుగెత్తింది.

అయిదు రూపాయలు, ఓ పాత చీర పట్టుకొచ్చి వెంకటరమణమ్మ చేటలోని బియ్యం మీద పెట్టింది.

"ఇదిగో గెద్దా! అమ్మాయి పెళ్ళికి తప్పకుండా రావాలి! పప్పు అన్నం తిని మరీ వెళ్లాలి! అప్పుడు కొత్త చీర పెడతా! తెలిసిందా!"

"మీ దయమ్మా!"

చేటలో బియ్యం తన బుట్టలో పోసుకుంది.

పాత చీర కూడా బుట్టలో పెట్టుకుని 5 రూపాయల నోటు రవికలో పెట్టుకుంది. కొందరు చేట బియ్యంలో ముందే ఉమ్మి పక్కన పెట్టుకుంటారు.

గెద్ద అటువంటి పనులు చెయ్యదు. అందరితోనూ మర్యాదగా మసలుకుంటుంది. అందరూ ఆమెను అలాగే చూస్తారు.

"అమ్మా! ఓ ముద్ద అన్నముంటే పెట్టమ్మా!"

"చద్దన్నం ఉంది. పట్టుకొస్తానుండు"

వెంకట రమణమ్మ లోపలకి వెళ్లింది.

ఓ అరిటాకులో అన్నం, కూర, కాస్త చింతకాయ పచ్చడి వేసి పట్టుకొచ్చి ఓ వారగా పెట్టింది.

"గెద్దా! తినిపోతావా?" అనడిగింది.

"లేదమ్మా! ఇంటికే పట్టుకెడతానమ్మా!" అరిటాకు నాలుగువైపులా మడిచి గంపలో వారగా పెట్టుకుంది.

"ఇంక ముసలిదానవయ్యావు? నడుం వంగింది. 'సోది చెబుతా' నంటూ ఎన్నాళ్లు తిరుగుతావు? నువ్వు ఇంటి పట్టున ఉండి నీ కోడల్ని పంపించవచ్చు కదా!"

వెంకట రమణమ్మ మాటలకి గెద్ద కళ్ళల్లో నీళ్లు సుళ్ళు తిరిగాయి.

"నీవు చెప్పినాది సత్తెమే కాని! నా కోడలికి మాట లేదాయె! అది సోది చెప్పజాలదు. కానుపు సేయడమే నేర్పినా! ఇప్పుడు ఆ మంత్రసానులంట... ఊరి మీదికొచ్చి మా నోటిలో మట్టి కొడుతున్నారమ్మా! ముగ్గురు తిండికే కరువయ్యేనమ్మా!" ఆమె కంఠం పూడుకుపోయింది.

"మరి, నీ కొడుకేమయ్యాడే? వాడు ఏ పని చెయ్యడా?"

"ఆడెక్కడికి పోతాడమ్మా! మొద్దు రాచిప్పలా ఇంట్లోనే ఉంటాడు. ఆడికి ఏ పనీ చేతకాదమ్మా! ఆడు చేతకానోడు! అందుకే మా బతుకులు ఇట్టయినాయి."

గెద్ద కళ్లొత్తుకుంది.

"నీకు వెండి వడ్డాణం, దండ కడియాలు, చేతి మురుగులు, మెళ్లో కంటెకాసులు అన్నీ ఉండేవి! ఇప్పుడేమయ్యాయే?"

"ఏమవుతాయమ్మా! అన్నీ పులుసులో పడ్డాయి. ఇంకేటి మిగిలేది? ఇవిగో... ఈ సత్తు మురుగులేనమ్మా!"

"గెద్దా! అనవసరంగా బాధపడకు! నీకూ మంచిరోజు లొస్తాయిలే!"

కదలడానికి మొరాయించే శరీరాన్ని బలవంతంగా లాక్కుంటూ ముందుకు అడుగులేసింది గెద్ద. మెల్లిగా ఇల్లు చేరుకుంది.

ఆ ఇల్లు ఓ తాటాకు గుడిసె.

నేల మీద ఓ తాటాకు తోకబుట్ట బోర్లించినట్టు ఉంటుంది.

చుట్టూ తాటాకు దడి- పైన తాటాకు కప్పు, 3 అడుగుల తాటాకు తలుపు. వీధుల్లో దాని పక్కనే అదే ఆకారంలో తాటాకు పాక. దానికి 1 అడుగు తలుపు మాత్రమే ఉండేది.

చంకలో ఉన్న బుట్ట తలుపు గొళ్ళెం తీసి లోపల పెట్టింది. చూరులో దాచిన చుట్ట తీసి సగం చేసింది. తిరిగి గుమ్మం బయటకు వచ్చి మట్టి అరుగుమీద కూర్చుని చుట్ట ముట్టించింది.

ఎండిన దవడలతో పొగ వదులుతుంటే ఆమె మనస్సు ఎటో తేలిపోతోంది.

గెద్ద మొగుడు కొడుకు పుట్టగానే మరో ఆమెతో ఎక్కడికో వెళ్లిపోయాడు. తిరిగి ఆ ఊరు రాలేదు. అందుకే బొట్టు తియ్యలేదు. మెళ్ళో ఇత్తడి పుస్తె అలాగే ఉండిపోయింది. వదిలేసి పోయినా, కట్టుకున్నవాడు గుర్తుకు రాగానే మనస్సు కలుక్కుమంది. చెయ్యి చురుక్కుమనగానే చుట్ట పీక వదిలేసింది.

జగ్గి ఎండు పుల్లలు ఏరుకుని ఇల్లు చేరింది.

"ఆ బుట్టలో అన్నం ఉంది. ఇద్దరం చెరోముద్దా తిందాం. నారిగాడికి ఓ ముద్ద ఉంచు" అంది గెద్ద.

జగ్గి సొట్టలు పోయిన సత్తు పళ్లెంలో అన్నం, కూర వేసి పట్టుకొచ్చింది.

మట్టి ముంతతో నీళ్లు తెచ్చి అక్కడ పెట్టింది.

ఆ కంచంలోనే ఇద్దరూ చెరో రెండు ముద్దలు తిన్నారు. సగం కడుపు కూడా నిండలేదు. ఇద్దరూ గ్లాసుడు నీళ్లు తాగారు.

పొట్టలు కాస్త నిండినట్లయ్యాయి.

చీకటి పడేవేళ నారిగాడు పందులు తోలుకుని కొంపకు చేరుకున్నాడు.

పందులు మొరాయిస్తున్నా బలవంతంగా ఆ చిన్న గుడిసెలోకి తోలి బలవంతంగా తలుపు పెట్టాడు. కాళ్లు, చేతులు కడుక్కుని అరిటాకులో మిగిల్చిన అన్నం ఆవురావురంటూ తిన్నాడు.

ఆరోజు తాను తెచ్చిన బియ్యం, డబ్బులు చూపించింది.

మూడు రోజుల వరకు తిండికి బాధ లేదని ముగ్గురూ మురిసిపోయారు.

“జగ్గీ! ఎల్లి మంచినూనె, కొబ్బరినూనె, చింతపండు, ఉప్పగడ్డలు, ఉల్లిపాయలు పట్టుకురాయె!” అంటూ రవికలో దాచిన 5 రూపాయలు తీసి ఇచ్చింది.

“ఈ డబ్బుతో ఇన్నొత్తాయా?” అంది జగ్గి అమాయకంగా!

“అదేటి? ఎందుకు రావే? మా కాలంలో అయితే ఓ బేడకు సీసాడు నూనె, అణాకు చింతపండు, అర్ధణాకు ఉల్లిపాయలు వచ్చేవి తెలుసా?”

“అదే కాలమేటి?” పకపకా నవ్వింది జగ్గి.

“ఏటా ఎర్రినవ్వు?” నారిగాడు విసుక్కున్నా వాడూ పకపకా నవ్వాడు.

“చీకటి పడకుండా ఎల్లి రాయే?”

గెద్ద మాటలకు వెంటనే బయలుదేరింది జగ్గి.

చిన్న సీసాతో మంచినూనె, మరో సీసాతో కిరసనాయిలు, కాస్త చింతపండు, ఉప్పురాళ్లు పట్టుకొచ్చి లోపల పెట్టింది. ఇంట్లో ఉన్న పాత నూకలతో గంజి కాచింది.

ముగ్గురు చెరో కాస్త తాగారు.

ఇంట్లో బుడ్డి దీపం వెలిగించింది. పాత తాటాకు చాప పరుస్తుంటే ఓ పాము పల్లి నేల జారింది. తాటాకు దడిలోంచి జరజర పాకుతూ బయటకు వెళ్లిపోయింది.

విషజీవాలు కూడా వారి బతుకుల్లో భాగాలే. అందుకే వారేమీ కంగారుపడలేదు.

ఆ చింకి చాపమీద మరో చింకి బొంత పరిచింది.

నారిగాడు దానిమీద నడుం వాల్చాడు. గాఢ నిద్రపట్టిందని అతని బరువు ఊపిరే చెబుతోంది.

వీధుల్లో మట్టి అరుగు మీద గెద్ద నడుం వాల్చి కళ్లు మూసింది. జగ్గి వెళ్లి మొగుడు పక్కలో చేరింది.

జగ్గి అప్పుడే కళ్ళు మూసిందో, లేదో... వీధుల్లో “ గెద్దా! గెద్దా!” అన్న పిలుపు వినబడింది.

జగ్గి ఉలిక్కిపడి లేచి బయటకు వచ్చింది.

అప్పటికే గెద్ద లేచి కూర్చుని “ఏరూ?” అంది.

"పెద్దబాబుగారి ఇంటికాడ నుంచొచ్చినా! అమ్మాయిగారికి నొప్పు లొత్తున్నాయంట. నిన్ను ఎంట బెట్టుకు రమ్మన్నారు!"

'ఇన్నాళ్టికి తిరిగి పని దొరికింది!' గెద్ద గుండె వేగంగా కొట్టుకుంది.

పాలేరు అరికెన లాంతరు చేతపట్టి ముందు నడుస్తున్నాడు. జగ్గి అతని వెంట బయలుదేరింది.

'ఎన్నో పాపాలు చేశాను. ఎందరో అత్తల మాటలు విని కోడళ్ళ కాన్పులు పోగొట్టాను. ఎందరో ఆడవాళ్ళ మాటలు విని మరి కాన్పులు కాకుండా మందులిచ్చి గొడ్రాళ్ళను చేశాను. ఈ పాపపు పని కోడలికి చెప్పలేదు. ఇవి నాతోనే అంతరించిపోవాలి. జగ్గి అమాయకురాలు. అందుకే పురుడు పోసి పసిబిడ్డను, తల్లిని కాపాడే పని నేర్పింది. పురుళ్లు పొయ్యడం అతి తేలిగ్గా చేస్తోంది. దాని చేయి మంచిదంటున్నారు. కొడుకు, కోడలు... పిల్లా, పాపలతో సుఖపడాలి'

– గెద్ద కళ్ళు అలసటగా మూతలు పడ్డాయి. నిద్రలోకి జారిపోయింది.

మూల గదిలో నులక మంచంమీద పడుకుని ఆ ఇంటి వారమ్మాయి బాధతో మెలికలు తిరుగుతోంది.

మంత్రసాని ఊళ్లో లేదు. అందుకే గెద్దకు కబురు పెట్టారు. జగ్గి ఆమెను సమీపించింది.

"సానా ఓర్చుకోవాలమ్మా! ఓర్చుకోవాలా!" అంటూనే జగ్గి లోపలి లంగా ముడి విప్పి చీర కిందికి జరిపింది.

పొట్ట నిండా ఆముదం రాసి బిగపట్టకుండా మెల్లిగా పైనుంచి కిందకు రాసింది. నెప్పులు ఎక్కువయినకొద్దీ లోపలి శిశువు ఎక్కడుందో జగ్గికి ఇట్టే తెలిసింది. కాస్త తేడాగా ఉంది.

అయినా నొప్పులొస్తుంటే శిశువు తల కిందికి దిగజారుతోంది.

"అమ్మో! అయ్యో!" ఆమె మరింత మూల్గుతోంది.

కన్నతల్లి ఆ బాధ చూడలేక ఆమె తల దగ్గిరే కూర్చుని కూతుర్ని ఓదారుస్తూనే వెక్కివెక్కి ఏడుస్తోంది.

ఆ తల్లీకూతుళ్ల అనుబంధం చూసి జగ్గి ఏమీ అనలేకపోయింది. నెప్పులు మరింత ఎక్కువయ్యాయి.

జగ్గి చేతులు ఆమె పొట్టమీద మిషన్‌లా పని చేస్తున్నాయి.

"రెండు పెద్ద నొప్పులకి పురుడు వచ్చేస్తదమ్మా!"

జగ్గి మాటలు ఆ తల్లికి ఊరటనిస్తున్నాయి.

ఆ పిల్ల తండ్రి పెరటి వసారాలో కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు.

నొప్పులు మరింత ఎక్కువయ్యాయి.

భూనభోంతరాళాలు బ్రద్దలయ్యేలా ఆమె అరిచింది. శిశువు ఈ ప్రపంచాన్ని చూసి కెవ్వుమంది.

"అమ్మా! మగ పిల్లాడు!"

అంతవరకు పడిన బాధలు, భయాలు, ఆందోళనలు అన్నీ అందరూ మర్చిపోయారు.

బాలింత మెల్లిగా కళ్ళు తెరచి చూసింది.

ఓ పెద్ద నిధి దొరికినంత సంతోషం! ఏదో మమకారం కడుపులోని పేగులు తెంచుకుని బయటకు వచ్చింది.

శరీరంలో ఏదో తెలియని కదలిక! శరీరం గగుర్పొడిచింది.

జగ్గి పసివానికి బొడ్డు కోసింది. స్నానం చేయించి తల్లి పక్కలో పడుకోబెట్టారు.

పాలు పొంగిన స్తనాలను ఆ బాలింత కన్న శిశువుకు అందించింది.

ఆ తల్లి ముఖంలో అనిర్వచనీయమైన ఆనందం చూసి- సంతానం లేని జగ్గి 'తనకా అదృష్టం ఎప్పుడు పడుతుందో..!' అనుకుంది.

గదంతా శుభ్రం చేసింది జగ్గి.

ఆవిడ పాత చీర ఇచ్చింది.

అక్కడే స్నానం చేసి ఆ పాత చీర కట్టుకుంది. తిరిగి పాలేరు ఆమెను ఇంటి ముందు దిగబెట్టి వెళ్లిపోయాడు.

అప్పటికే అర్ధరాత్రి దాటింది. ప్రతిరోజు జగ్గి పురిటి బాలింత దగ్గర అవసరమైన పనిచేసి వెడుతోంది.

పదిరోజులు ఇట్టే గడిచాయి.

మునుపటిరోజుల్లో బాలింతను పసిబిడ్డను ఎన్నెమ్మ సంధి కొడుతుందని కిటికీ తలుపులు, గది తలుపులు మూసి ఉంచేవారు.

అది కంచిరీగ ఆకారంలో వస్తుందని భయపడేవారు. ఊకతో పొగ వేసేవారు. గెద్ద కాలంలో ఆ భయం మరింత ఉండేది. రానురాను తగ్గిపోయాయి. కొందరిళ్లలో ఆ భయం ఇంకా పోలేదు.

జగ్గికి అవేమీ పట్టవు. తన పని తాను చేసుకుపోతుంది.

11వ రోజు పురిటి స్నానం చేయించడానికి జగ్గి వచ్చింది.

ఊరిలోని ముత్తయిదువులందరు పెద్ద నిమ్మకాయంత పసుపుముద్ద బిందెకు పెట్టి నిండా వేడినీళ్లతో పట్టుకొచ్చి పెరటి అరుగంతా నింపేశారు.

ముందు పిల్లవానికి స్నానం చేయించి జల్లెడలో పడుకోపెట్టారు.

బాలింతకు పసుపు ముద్దలు రాసి, నెత్తిన జల్లెడ పెట్టి, తెచ్చిన బిందెలలోని వేడినీళ్లు పోసి స్నానాలు చేయించారు.

తెలకపిండి కూర, పప్పు, పెరుగు, అన్నము ఎన్నెమ్మకు నైవేద్యం పెట్టారు ఇంటివారు.

దానిని జగ్గి, బట్టలుతికే లచ్చిమి తిన్నారు.

వీధిన పోయే కుక్కను తెచ్చి దాని ముఖాన పసుపు రాసి జగ్గి కుంకుమ బొట్టు పెట్టింది. భైరవుడని పూజ చేసి, ఆ కుక్కకు పెరుగు అన్నం పెట్టి జగ్గి వదిలేసింది. వారిచ్చిన బియ్యం, ధాన్యం, మరో పాత చీర తీసుకుని జగ్గి ఇంటికి తిరిగి వచ్చింది.

కోడలు కోసం ఎదురుచూస్తూ గెద్ద ఆ మట్టి అరుగుమీదే కూర్చుని ఉంది. కోడల్ని చూడగానే ఆ ముసలి కళ్ళలో కొత్త కాంతి తళుక్కుమంది.

"ఇంత పొద్దుపోయేదాకా ఏం సేసినావేటి?"

"అన్నీ సేసినా! ఎన్నెమ్మకు ఎట్టిన సద్ధి తిందాంరా?" జగ్గి అన్నం చూపించగానే గెద్ద నోటిలో ఊరిన లాలాజలాన్ని చప్పరించింది.

గెద్ద రెండు ముద్దలు తిని "నువ్వు తినుకో!" అంది.

"నేనాడ తినొచ్చినా... ఇదిగో ఈ సీర నీకే!" బుట్టలో చీర తీసిచ్చింది.

"ఈయాలో, రేపో పోయేదాన్ని... నా కెందుకే ఈ సీర!"

"ఎందుకేటి! నా కోటి ఇచ్చినారుగా! ఇది నీకే!" అత్త ముందు పెట్టింది.

"ఇదిగో! ఇన్ని బియ్యం గింజలిచ్చినారా? ఇన్ని వడ్లగింజలా? ఈరిది పెద్దసెయ్యే! ఇలా కాన్పులకి పిలుత్తుంటే మన బతుకులు బాగపడతాయే!"

"గెద్దా! గెద్దా! అమ్మగారికి కడుపునొప్పట! నిన్ను సూసి పొమ్మన్నారు!"

"మీరెల్లండి బాబూ! అట్లాగే వత్తా!"

"సరే!" వచ్చిన వ్యక్తి తిరిగి వెళ్లాడు.

"అదేటి నువ్వెందుకంట? నే ఎల్లా!"

"జగ్గి! నే ఎల్లి వత్తాలే!"

జగ్గి వద్దన్నా వినకుండా గెద్ద ఆ ఇంటికి వెళ్లింది.

ఆ నొప్పులు అజీర్ణపు నొప్పులని గెద్ద ఇట్టే పసిగట్టింది. ఆమెకు తగిన జాగ్రత్తలు చెప్పి ఇంటిదారి పట్టింది. గెద్ద మట్టి అరుగు మీద అలాగే కూలబడింది.

"అదేటి అత్తా! ఏటయినాది?"

"ఏందో... ఈడ నొప్పిగా ఉందే!" గుండెల మీద చెయ్యివేసి చెప్పింది.

"అదేటి? ఆచారిగారొద్ద మందు తేనా?"

"వద్దే! ఇగ నేను ఉండనే. అన్నీ నీకు సెప్పినా? ఇగ నే ఎల్లి పోతున్నా!"

ఆ సాయం సంధ్యలో ఓ కృష్ణ గెద్ద 'కృష్ణా' అంటూ ఆకాశంలో ఎగురుకుంటూ పోయింది.

గెద్ద ఆ మట్టి అరుగుమీద వాలిపోయింది.

"ఓ యత్తో!" అంటూ జగ్గి ఆ శరీరం మీద పడి బావురుమంది.

\- 'పత్రిక' మాస పత్రిక... ఏప్రిల్, 2002